సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 12 । నవంబర్ । 2024



పార్కింగ్ దందా

శ్రీముఖలింగంలో పార్కింగ్ దందా జరుగుతోంది. భక్తులు ఇబ్బంది పడుతున్నారు. - 8లో



ముగిసిన స్టేట్‌మీట్

స్కూల్ గేమ్స్ స్టేట్‌మీట్ ముగిసింది. ఆటగాళ్లు అదరగొట్టారు. - 8లో

ఆకులతంపర ర్యాంపులో వాహనాలు సీజ్

కొత్తూరు: కొత్తూరు మండలంలోని అంగూరు ఇసుక ర్యాంపులో ఇసుక లోడ్‌తో ఉన్న టిప్పర్, పొక్లెయినర్లను సోమవారం స్థానిక ఆర్‌ఐ లక్ష్మణ రావు, వీఆర్‌ఓ జె.దుర్వాసులు పట్టుకున్నారు. ర్యాంపులో యంత్రాలు అనధికారికంగా వినియోగిస్తున్నందున తహసీల్దార్ రవిచంద్ర ఆదేశాలు మేరకు రెండు వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఆర్‌ఐ తెలిపారు.

బడ్జెట్ - పబ్లిక్ టాక్

నిలువెత్తు మోసం



చంద్రబాబు తన నైజాన్ని చూపించారు. మొదటి బడ్జెట్‌లోనే నిలువునా మోసం చేశారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలకు నిధులు ఇవ్వలేదు. కొన్నింటికి విదిల్చినా అదీ అరకొరగానే ఇచ్చారు. ఇది రాష్ట్ర ప్రజలను మోసగించడమే. మహిళలకు ఉచిత బస్ అన్నారు, బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. నిరుద్యోగ భృతి ఊసెత్తలేదు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఆ మాటే లేదు. తల్లికి వందనంకు కేటాయించిన నిధులు ఏ మూలకూ సరిపోవు. ఇది ప్రజలను ముంచే బడ్జెట్.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

విద్యా రంగానికి అరకొర నిధులు



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 9.8 శాతం నిధులు కేటాయించారు. గత బడ్జెట్‌లతో పోల్చితే ఇది చాలా తక్కువ. నాడు–నేడు పనులు నిధులు లేక నిలిచిపోయాయి. వాటికి నిధులు కేటాయించకపోవడం శోచనీయం. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు, 12వ పీఆర్‌సీ అమలుకు నిధులివ్వలేదు.

– బమ్మిడి శ్రీరామ్మూర్తి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మానవ వనరుల ప్రగతికి ప్రాధాన్యత



ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులో మానవ వనరుల ప్రగతికి ప్రాధాన్యత ఇచ్చింది. వ్యవసాయ రంగానికి కేటాయింపులు మెరుగ్గా ఉన్నాయి. సంక్షేమ రంగానికి సైతం మంచి కేటాయింపులు చేశారు.

– డాక్టర్ ఎంపీ సూరిగణేష్, ఆర్‌జీయూకేటీ మేనేజ్‌మెంట్, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఆర్థిక పరిస్థితులు గట్టెక్కిస్తే బాగుండేది..



రాష్ట్రంలో సంపదను సృష్టించి ఆర్థిక సమస్యల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే ప్రతిపాదనలు ఉంటే బాగుండేది. సూపర్ సిక్స్ హామీ పథకాలు తల్లికి వందనం, స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి వాటికి ప్రతిపాదనల్లో క్లారిటీ లేదు. పోలవరం నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లింపుపై సైతం ప్రతిపాదనలు లేవు.

– ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పూర్వపు వైస్ చాన్స్‌లర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

ప్రజా వ్యతిరేక బడ్జెట్



ప్రజలకు ఇచ్చిన హామీలకు తగ్గ బడ్జెట్ కేటాయింపులు లేవు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్. ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించలేదు.

– గంగరాపు సింహాచలం సీపీఎం, జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు

సూపర్ సిక్స్‌కు కేటాయింపులేవీ



సూపర్ సిక్స్ హామీలకు కేటాయింపులు లేవు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి వంటి పథకాలకు నిధులు కేటాయింపులులేవు. బడ్జెట్ నిరాశ పరిచింది.

– మీసాల వెంకటరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ కన్వీనర్, హిరమండలం

ఎన్నికల ముందు హామీలు ఏమయ్యాయి?



ఎన్నికల మునుపు ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు దోమపోటు నష్టపరిహారం ఇస్తామన్నారు. ఏమైంది. అన్నదాత సుఖీభవ పథకంపై ఎలాంటి క్లారిటీ లేదు. బడ్జెట్ రూపంలో మరోసారి రైతులకు అంకెల గారడీ చూపించారు.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త

హామీల అమలుకు దిక్కు లేదు..



ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు దిక్కు లేకుండా పోయింది. వ్యవసాయ బడ్జెట్‌లో రూ.43,402 కోట్లు కేటాయించారు. మరి రైతులకు పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ ఎందుకివ్వలేదు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, తల్లికి వందనం, 18 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న మహిళకు నెలకు రూ.1500 ఎప్పుడు ఇస్తారో తెలియని దుస్థితి.

– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం



● హరోం హర



శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో స్వామికి అభిషేకం



జలుమూరు: పూజలు అందుకుంటున్న ముఖలింగేశ్వరుడు

తొలిపొద్దు జాము నుంచి శివుడిపై పంచామృతాలు కురుస్తూనే ఉన్నాయి. వేకువ ఘడియల నుంచి హరుని ఆలయ ఆవరణలో గంటలు గణగణ మోగుతూనే ఉన్నాయి. పవిత్ర కార్తీక మాసం రెండు సోమవారం నాడు జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. నమక చమక సహిత మంత్రాలతో స్వామిని అర్చించి అభిషేకించారు.

టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామికి శీర్షాభిషేకాలు చేస్తున్న భక్తులు





దర్జాగా దోపిడీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

- ఇసుక రీచుల్లో లారీ సామర్థ్యం ప్రకారం అక్రమ వసూళ్లు
- ప్రభుత్వం నిర్దేశించిన ధరతో పాటు అదనపు వసూళ్లు
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన లారీ ఓనర్స్ సంఘ ప్రతినిధులు

పది టైర్ల లారీకి రూ.12 వేలు, పన్నెండు టైర్ల లారీకి రూ.14వేలు, పద్నాలుగు టైర్ల లారీకి రూ.16వేలు, పదహారు టైర్ల లారీకి రూ.18వేలు.. ఇవేమీ వేలంపాట ధరలు కావు. ప్రభుత్వం అధికారికంగా జిల్లాలో నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ల్లో అక్రమంగా చేస్తున్న వసూళ్లు. ప్రభుత్వం టన్ను ఇసుకకు నిర్దేశించిన ధరతో పాటు అదనంగా చెల్లించుకోవాల్సి వస్తున్న కప్పమిది. ఇవేమీ ఉత్తుత్తి ఆరోపణలు కూడా కావు. సాక్షాత్తు ప్రతి రోజూ ఆయా రీచ్‌ల వద్దకు వెళ్లి ఇసుక తీసుకొస్తున్న లారీ యజమానుల సంఘ ప్రతినిధులు చేసిన ఫిర్యాదు ఇది. సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లో నేరుగా మూడు లారీ అసోసియేషన్ల యజమానులు మూకుమ్మడిగా మొర పెట్టుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కింద చెల్లించిన సొమ్ముతో పాటు అడ్డగోలుగా అదనంగా వసూలు చేసిన సొమ్ముకు రశీదులు ఇవ్వడం లేదని కూడా ఫిర్యాదులు చేశారు.

అక్రమార్కులకు ప్రభుత్వమే లైసెన్సు ఇచ్చినట్టుగా జిల్లాలోని అధికారిక రీచ్‌ల్లో ఇసుక దందా సాగుతోంది. పట్టపగలు, బహిరంగంగా ఇసుక పేరుతో లూటీ చేసేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం అంబళ్లవలస, బట్టేరు, అంగూరు, బూరవల్లి, గార, గోపాల పెంట, కాఖండ్యాంలలో అధికారిక రీచ్‌లు నడుస్తున్నాయి. ఇవన్నీ తమకు కావాల్సిన వారికి అధికారుల ద్వారా ప్రభుత్వ పెద్దలు కట్టబెట్టారు. ఆ మధ్య జరిగిన ఇసుక రీచ్‌ల టెండర్ల వ్యవహారం ఎలా సాగిందో జనమంతా చూశారు. చివరకు టెండర్లు వివాదాస్పదంగా మారి తమకు కావాల్సిన వారికి అనధికారికంగా రీచ్‌లు కట్టబెట్టేశారు. ఇంకేముంది వారంతా దర్జాగా దోపిడీ చేస్తున్నారు.

చంద్రబాబు మాటలకు అర్థాలే వేరులే..

'ఉచిత ఇసుకలో అక్రమాలు జరగడానికి వీల్లేదు.. ఏ స్థాయిలో తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయి. అన్ని బంధనాలు తొలగించి, రవాణా,తవ్వకం చార్జీలు కూడా వీలైనంత తక్కువ ధర ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఇసుక తవ్వకుని తీసుకెళ్తే రుసుం వసూలు చేయవద్దు. ఇసుక అక్రమాలు జరగకుండా ఇన్‌చార్జి మంత్రులు బాధ్యతలు తీసుకోవాలి. పదిరోజుల్లో మార్పు రాకుండా ఉపేక్షించను.' అని చంద్రబాబు అన్నారు. కానీ ఇదంతా మీడియా ముందు చేసిన హడావుడి మాత్రమేనని తేలిపోతోంది. ప్రజల్ని మభ్య పెట్టేలా సీరియస్‌గా స్పందించి, అంతర్గతంగా ఎవరికి తోచినంత వారు దోచుకునేలా ప్రోత్సహించడమే ఈ ప్రభుత్వ ధోరణి అనే అభిప్రాయం కలిగిస్తోంది. జిల్లాలో ఎక్కడా ఉచితంగా ఇసుక దొరకడం లేదు. చివరికి ట్రాక్టర్లకు ఫ్రీ అని చెప్పారు. వాటికి కూడా దర్జాగా వసూలు చేస్తున్నారు. ఇక, లారీలకైతే చెప్పనక్కర్లేదు. రోజుకి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు.



గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు

బండారం బయటపెట్టారిలా..



కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న ఇసుక దోపిడీని సాక్షాత్తు లారీ యజమానులు బయటపెట్టారు. రీచ్‌ల్లో కొనసాగుతున్న గుట్టు రట్టు చేశారు. ఇక్కడి నుంచి ప్రతి రోజూ ఇసుకను రవాణా చేసే లారీ యజమానులంతా అసోసియేషన్ ద్వారా వచ్చి సోమవారం కలెక్టరేట్‌కు ఏకంగా ఫిర్యాదు చేశారు. క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.వెంకటరమణ, కె. వెంకట్, బి.సురేష్, సింహాద్రి లారీ అసోసియేషన్ ప్రతినిధులు బి.శ్రీను, కె.శ్రీనివాసరావు, మణికంఠ లారీ అసోసియేషన్ ప్రతినిధులు బి.రాంబాబు తదితరులు తమ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో కలిసి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

- ఏ లారీకి ఎంత అక్రమంగా వసూలు చేస్తున్నారు...రీచ్‌ల్లో అవకతవకలు ఎలా జరుగుతున్నాయో వివరించారు.
- తమ వద్ద అక్రమంగా వసూలు చేసిన సొమ్ముకు బిల్లులు ఇవ్వకపోవడంతో వివిధ శాఖల అధికారులు మార్గం మధ్యలో ఓవర్ లోడ్ అని, మైనింగ్ బిల్లు లేదని కేసులు పెట్టి, వాహనాలను సీజ్ చేస్తున్నారని తమ ఫిర్యాదులో మొర పెట్టుకున్నారు.
- ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న రీచ్‌ల్లోనే అక్రమ వసూళ్లు జరుగుతున్నాయంటే అనధికారికంగా టీడీపీ పెద్దల ఆధ్వర్యంలో నడుస్తున్న రీచ్‌ల్లో ఇంకెంత దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.
- ఆమదాలవలస, శ్రీకాకుళం, పాతపట్నం, నరసన్నపేట, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఇసుక దందాకు అడ్డు అదుపూ లేకుండా సాగుతోంది. మొత్తానికి తమ్ముళ్లకు ఉచిత ఇసుక రూ. కోట్లు కురిపిస్తోంది.



ఇసుక రీచ్‌ల్లో అక్రమ వసూళ్లపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు

ఆమదాలవలస వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా చింతాడ రవికుమార్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఆమదాలవలస నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా చింతాడ రవికుమార్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం సాయంత్రం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా, నాయకుడిగా పనిచేస్తుండటంతో ఆయనకు గుర్తింపు దక్కింది. ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ విప్ కూన రవికుమార్‌పై అలుపెరగని పోరాటం చేశారు. 2014–19లో జరిగిన ఇసుక అక్రమాలు, భూకబ్జాలపై న్యాయపరమైన పోరాటం కూడా చేశారు. యువ నాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జిగా రవికుమార్ వ్యవహరిస్తున్నారు. పార్టీ పరిశీలకుడిగా కూడా పనిచేశారు. తాజాగా నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంతో పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆయనకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు.



చింతాడ రవికుమార్

16.650 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం: మండలంలోని లొద్దపుట్టి గ్రామం తులసమ్మ గుడి సమీపంలో 16.650 కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. సీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్ జిల్లా, బస్సీ గ్రామానికి చెందిన నరేష్‌మోహతా, చత్తీస్‌గఢ్ రాష్ట్రం, కొరియ జిల్లా చిరిమిరి గ్రామానికి చెందిన మున్ని ఖాలిచో అలియాస్ అనితలు ఒడిశాలో ఖందమాల్ జిల్లా ఫిరింగియా గ్రామం సమీపంలోని బసంత్ దిగాల్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి పూణేకి తరలించేందుకు తీసుకెళ్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయనతో పాటు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

'నాకు ప్రాణహాని ఉంది'


శ్రీకాకుళం క్రైమ్ : తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు భద్రత కల్పించాలని బూర్జ మండలం గుత్తావిల్లికి చెందిన సనపల సురేష్ కుమార్ సోమవారం జిల్లా పోలీసుకార్యాలయంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 16న జిల్లాకేంద్రంలోని రిమ్స్–బలగ కూడలి వద్ద తన కారును ధ్వంసం చేయడమే కాకుండా తనపై హత్యాయత్నం చేసిన వారిని నేటికీ రెండో పట్టణ పోలీసులు అరెస్టులు చేయలేదని ఆయన తెలిపారు. తరచూ ఇసుక, భూదందాలపై ఫిర్యాదులు చేయడం, గత నెల 15న 1800 టన్నుల ఇసుకను పట్టించాననే కక్షతో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తన అనుచరులు, కొంతమంది ఇసుక అక్రమ రవాణాదారులతో ఈ దాడి చేయించారన్నారు. అంతకుముందు బూర్జ మండలం కాఖండ్యాం ఇసుక రీచ్‌లో అక్రమాలపై ఫిర్యాదు చేయడంతో ఇదే కూన రవికుమార్ సెప్టెంబర్ 27న తన అనుచరులతో వెదురు కర్రలతో దాడి చేయించి చంపాలని చూశారన్నారు. దీనిపై అప్పట్లో ఎంఎల్‌సీ అయినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదని, 16న బలగ కూడలిలో జరిగిన దాడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినా అరెస్టు చేయకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. దీనిపై పోలీసులను అడిగితే తమకు రాజకీయ ఒత్తిడి ఉందని చెప్పడమే కాక.. తిరిగి తనపైనే అక్రమ కేసుల్లో అరెస్టు చేయించారన్నారు. తన ఆరోగ్యం బాగోలేనప్పటికీ రూరల్ పీఎస్‌లో కట్టిన కేసుల్లో భాగంగా అరెస్టు కూడా చేశారన్నారు.

తనపై దాడి జరిగి సుమారు నెలరోజులు కావస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడానికి నిరసనగా బలగ కూడలి వద్దే దీక్ష చేపడతానని, దీనికి అనుమతి ఇవ్వాలని ఎస్పీని ఫిర్యాదులో కోరడం గమనార్హం. ఎస్పీ లేకపోవడంతో అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని సురేష్ అందించారు.



జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సనపల సురేష్

బడ్జెట్‌లో సిక్కోలుకు చోటేదీ..?



- కీలక ప్రాజెక్టులకు స్పష్టత కరువు
- ఇరిగేషన్‌కు అరకొర కేటాయింపులు
- విద్యా సంస్థలపై చిన్నచూపు
- నగదు బదిలీ పథకాల ఊసేలేదు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి తొలిపద్దు జిల్లాను నిరాశ పరిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీగానే కనిపిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయానికి సంబంధించి జిల్లాకు ప్రత్యేక కేటాయింపులేవీ లేవు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థలకు నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వలేదు. సూపర్ సిక్స్‌లో కీలకమైన ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలకు నిధుల కేటాయింపు చేయలేదు.

ప్రత్యేక మేలు ఏదీ..?

- ఆమదాలవలస నియోజకవర్గంలో గత ప్రభుత్వం వెన్నెలవలస వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల, తొగరాం అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల, పెద్దపేట హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ వంటి కీలక విద్యా సంస్థలను నెలకొల్పింది. వాటికి పక్కా భవనాలు, ఇతరత్రా మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. వాటి కోసం బడ్జెట్‌లో ప్రస్తావన కనబడలేదు.
- నాగావళి నదిపై బలసలరేవు వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు ఈ ప్రభుత్వం వచ్చాక ఆగిపోయాయి. వాటికి నిధుల కేటాయింపు, పనుల పురోగతిపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు.
- తొగరాంలో డిగ్రీ కళాశాల, పొందూరులో డిగ్రీ కళాశాల భవన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీటికి నిధులు కేటాయించిన దాఖలాలు కనిపించలేదు.
- వైఎస్సార్ కలల విద్యా సంస్థ ట్రిపుల్ ఐటీలో 6600 మందికి సీట్లు లభించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం కృషి చేసింది. రూ.131కోట్లతో జీప్లస్5 బ్లాక్‌లను మూడు నిర్మించింది. మరో రూ.67కోట్లతో న్యూ అకాడమీ బ్లాక్‌ను నిర్మించే పనులుమొదలుపెట్టింది. ఈ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. అదే విధంగా మరో రూ.133కోట్లతో ఆరువేల మందికి సరిపడా వసతి ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పుడా పనులు పూర్తి చేసి, 6,600మందికి పూర్తి స్థాయిలో వసతి ఉండేలా బాధ్యత తీసుకోవాల్సి ఉంది. ఆ దిశగా నిధులు కేటాయింపు జరగలేదు.
- జిల్లాకే తలమానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గత ప్రభుత్వం రూ. 45కోట్లతో పలు భవనాల నిర్మాణాలు చేపట్టింది. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు కార్యాచరణ, నిధుల కేటాయింపు ప్రస్తావన లేదు.



క్లారిటీ ఏదీ?

- సుదూర తీర ప్రాంతం ఉన్న జిల్లాలో మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు, జిల్లాలో విస్తారంగా దొరుకుతున్న ముడిసరుకులు, ఖనిజాలను ఎగుమతి చేసేందుకు మూలపేటలో ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70 కోట్లతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మాణ పనులు మొదలుపెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు చకచకా సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులకు బ్రేక్ పడింది. దీన్ని పూర్తి చేసే విషయంలో తాజా బడ్జెట్‌లో స్పష్టమైన క్లారిటీ ఇవ్వలేదు.
- మత్స్యకారుల కోసం రూ. 365.81కోట్లతో ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు కూడా వైఎస్సార్‌సీపీ చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ఆగిపోయాయి. తాజా బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు. జనరలైజ్డ్‌గా ప్రస్తావన చేసి వదిలేసింది.
- వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేటలో రూ.11.95కోట్లతో చేపట్టిన జెట్టీ పనుల నిర్మాణంతో హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి కూడా బడ్జెట్‌లో ప్రత్యేక ప్రస్తావన కనబడలేదు.
- పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం సుమారు రూ.226 కోట్లతో శ్రీకారం చుట్టిన పనులను ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. దీని ప్రస్తావన లేదు.

ఇరిగేషన్‌కు అంతంత మాత్రంగా..

- తాజా బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ఇరిగేషన్‌కు సంబంధించి అరకొర కేటాయింపులు చేసింది.
- వంశధార లిఫ్ట్ ఇరిగేషన్‌పై స్పష్టత ఇవ్వలేదు. స్టేజ్–2లోని ఫేజ్–2 పనులకు రూ.120కోట్ల వరకు అవసరం కాగా రూ.63.50కోట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొంది.
- మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు రూ.300కోట్లు అవసరం కాగా రూ.37.71కోట్లు మేర బడ్జెట్‌లో ప్రస్తావించింది. తోటపల్లి, నారాయణపురం ఆనకట్టకు రూ.500కోట్లు మేర అవసరం ఉంది. రూ.32.84కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. బాహుదా ఓపెన్ హెడ్ ఛానెల్‌కు రూ.30 కోట్లు, పైడిగాం మైనర్ ఇరిగేషన్‌కు రూ.36కోట్లు, కళింగపట్నం రక్షణ గోడకు రూ. 7కోట్లు, మంచినీళ్లపేట ఫిష్ ల్యాండ్ ప్రాంతానికి రూ.7కోట్లు, జైకా మెయింటెనెన్స్‌కు రూ.80కోట్లు, ఫ్లడ్ బ్యాంక్స్‌కు రూ.10కోట్లు, చెరువుల మరమ్మతులకు రూ.20కోట్లు అవసరం ఉందని ఇరిగేషన్ శాఖ ప్రతిపాదనలు పంపించింది. వీటిపై స్పష్టత లేదు.

నగదు బదిలీ పథకాల మాటేమిటి..?

టీడీపీ సూపర్ సిక్స్ ఎన్నికల హామీల్లో నగదు బదిలీతో ముడిపడిన పథకాలు ఐదు ఉన్నాయి. యువతకు నిరుద్యోగ భృతి, రైతులకు ఏటా ఆర్థిక సాయం, మహిళలకు ప్రతి నెలా భృతి, తల్లికి వందనం వంటి హామీలపై కార్యాచరణ ప్రకటించలేదు. ఆయా శాఖలకు సాధారణ కేటాయింపులే తప్ప ప్రత్యేక కేటాయింపులు చేయలేదు. జిల్లాలో లక్షలాది మంది ఈ పథకాల కోసం ఎదురు చూస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రకటించిన సంక్షేమ పథకాలన్నీ నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం అమలయ్యేవి. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

అక్రమ కేసుల బాధితులకు అండగా..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జశ్వంత్. చిత్రంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చీపురపల్లి పంచాయతీ కొండపల్లి గ్రామానికి చెందిన సోషల్ మీడియా అక్రమ కేసు బాధితుడు మడ్డు జశ్వంత్ సోమవారం రాష్ట్ర మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసుల నేపథ్యంలో బాధితులకు జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ఇటీవల జశ్వంత్‌పై వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో తమకు అండగా ఉంటానని జగనన్న భరోసా ఇచ్చారని జశ్వంత్ తెలిపారు.

- శ్రీముఖలింగంలో అదనపు వసూళ్లు
- నిబంధనలకు పాతరేసిన పాటదారుడు
- పట్టించుకోని అధికారులు



కారుకు రూ.50 వసూలు చేసిన రశీదు

పరమేశ్వరుడి చెంత..
పార్కింగ్ దందా!



వాస్తవ ధరల పట్టిక



శ్రీముఖలింగం ఆలయం వద్ద వాహనాలు

జలుమూరు : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీముఖలింగంలో పార్కింగ్ పేరిట దోపిడీ సాగుతోంది. నిర్దేశిత మొత్తానికి అదనంగా వసూలు చేస్తూ నిబంధనలకు పాతర వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడి పార్కింగ్ వసూళ్లు ఇష్టారాజ్యంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు బేఖాతరు..

ఆలయానికి వచ్చే వాహనచోదకుల నుంచి ఆశీల వసూలుకు ఏడాదికి ఒకసారి వేలం పాట నిర్వహిస్తారు. అధిక మొత్తానికి ఎవరు పాట దక్కించుకుంటారో వారికే పంచాయతీ ఆశీల వసూలు బాధ్యతలు అప్పగిస్తారు. ఈ ఏడాది జూన్‌లో రూ.3.26 లక్షలకు వేలం పాట ఖరారయ్యింది. ఇందులో ద్విచక్ర వాహనానికి రూ.10, ఆటో రూ.20, కారు రూ.30, మినీ వ్యాన్ రూ.70, టూరిస్ట్ బస్ రూ.100, లారీకి రూ.100 చొప్పున వసూలు చేయాలి. ఇక్కడ వేలం పాటదారుడు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తుండటంపై భక్తులు మండిపడుతున్నారు. కారుకు రూ.30 ఉండగా రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. శివరాత్రి, కార్తీక మాసం వంటి పర్వదినాలతో పని లేకుండా ఇక్కడ ఏడాది మొత్తం అక్రమ వసూళ్ల దందా సాగుతోంది. బోర్డులో సూచించిన విధంగా కాకుండా అదనంగా వసూలు చేస్తున్నారు. ఇందుకు పంచాయతీ రశీదులు సైతం ఇవ్వడం గమనార్హం. ఇటీవల ఓ మాజీ ఎమ్మెల్యే వాహనానికి ఆశీలు రూపంలో అదనంగా అడగడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో మిన్నకుండిపోయారు.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి చిన్నాల శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. అక్రమ వసూళ్లపై ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఇక నుంచి అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే వారిని పిలిపించి హెచ్చరించామని తెలిపారు.

క్లుప్తంగా

ఎస్పీ గ్రీవెన్స్‌కు 49 వినతులు



సమస్య వింటున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్) 49 వినతులు అందాయి. ఇందులో పాత ఫిర్యాదులు ఎనిమిది ఉండటం గమనార్హం. అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు అర్జీదారుల నుంచి ఫిర్యాదులు అందుకుని సత్వరమే పరిష్కారం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

'మీకోసం' 53 వినతులు



రిజిస్ట్రేషన్ కౌంటర్లను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 53 వినతులు వచ్చాయి. సమస్యలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని టీపీ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు 10 నెలల బకాయి వేతనాలు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీ.హెచ్.అమ్మన్నాయుడు కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు అన్యమతాల్లో చేరితే వారికి ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువపత్రాల మంజూరు నిలిపివేయాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల రక్షణ సంక్షేమ వేదిక అధ్యక్ష, కార్యదర్శులు చింతాడ సోమేశ్వరరావు, మురపాక సన్యాసిరావు కోరారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కారు బోల్తా



పల్టీలు కొట్టిన కారు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి జాతీయ రహదారిపై కారు పల్టీలు కొట్టింది. బరంపురం పట్టణానికి చెందిన శ్రీనివాస్ దంపతులు కారులో సోమవారం ఉదయం టిక్కలి వస్తుండగా లొద్దపుట్టి వెంకటేశ్వర ఆలయం సమీపంలో ఎదురుగా బైక్‌ను తప్పించబోయి పల్టీకొట్టి బోల్తాపడింది. స్థానికులు గమనించి వెంటనే దంపతులను బయటకు తీశారు. చిన్నపాటి గాయాలు తప్ప పెద్దగా ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

చిట్స్ మేనేజర్‌పై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని సరస్వతీ థియేటర్ సమీపంలోని శ్రీరామ్ చిట్స్ బ్రాంచి మేనేజర్ ఆర్. మణికంఠపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 9న ప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్న కరక సత్యనారాయణ, రమ దంపతుల ఇంటికి ముగ్గురు విశాఖ వాసులతో వెళ్లిన మేనేజర్ పెట్రోల్ పోసి బెదిరించిన సంగతి తెలిసిందే. బాధితురాలు రమ అదే రోజు సాయంత్రం ఫిర్యాదు చేయగా సీఐ ఈశ్వరరావు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు.

లిఫ్ట్ ప్రమాదంలో కార్మికురాలు మృతి



లిఫ్ట్ ప్రమాదం జరిగిన ప్రదేశం



రామలక్ష్మి(ఫైల్)

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో ఏపీటోరియా (అరబిందో) పెన్సిలిన్ ప్లాంట్‌లో క్యాంటీన్ కార్మికురాలు దోర రామలక్ష్మి(37) లిఫ్ట్ ప్రమాదంలో దుర్మరణం చెందింది. జె.ఆర్.పురం పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పెన్సిలిన్ ప్లాంట్ క్యాంటీన్ వద్ద లిఫ్ట్ కింద ప్రాంతంలో రామలక్ష్మి శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా పైనుంచి లిఫ్ట్ బాక్స్ కిందకు పడిపోయింది. అందులో రామలక్ష్మి ఇరుక్కుని తీవ్ర గాయాల పాలైంది. వెంటనే పరిశ్రమ అంబులెన్స్‌లో విజయనగరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఆమె అత్తవారు విజయనగరంలోని కోడగంటివారి వీధిలో ఉండగా.. ఉద్యోగ రీత్యా పైడిభీమవరంలోని తల్లి ఇంటి వద్దే ఉంటోంది. పన్నెండేళ్లుగా ఇక్కడే పనిచేస్తోంది. భర్త అప్పలరాజు విజయనగరంలో ఉంటున్నారు. ముగ్గురు పిల్లలు పుట్టి చనిపోయారు. మృతురాలి సోదరుడు గోర అప్పలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

50 లక్షల పరిహారం చెల్లించాలి..

రామలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ.50లక్షలు పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరిశ్రమలో సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. పరామర్శలో విజయనగరం జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఏ.జగన్మోహన్ తదితరులు ఉన్నారు.

కొనసాగిన కక్షసాధింపు



అధికారులతో మాట్లాడుతున్న బాధితుడు రామకృష్ణ

పోలాకి: మండలంలోని చెల్లాయివలసలో అధికార పార్టీ కక్షసాధింపు వరుసగా రెండోరోజు కూడా కొనసాగింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతు రామకృష్ణకు చెందిన పశువుల శాలను సోమవారం ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా అధికారులు తొలగించారు. మూగజీవుల తరలింపునకు ప్రత్యామ్నాయం కోసం ఒక్కరోజు గడువు అడిగినా తహశీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్‌లు అవకాశం ఇవ్వలేదు. పోలాకి, నరసన్నపేట ఎస్ఐలు రంజిత్, దుర్గాప్రసాద్‌తో సహా పదుల సంఖ్యలో సిబ్బందిని మోహరించి భయభ్రాంతులకు గురిచేయడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ అధికారులకు పూర్తిగా సహకరిస్తామని.. గ్రామంలో అనేక ప్రభుత్వ స్థలాల్లో పక్కా నిర్మాణాలు జరిగాయని, వాటిని సైతం తొలగించాలని కోరారు. లేకుంటే ఇవే స్థలాల్లో మళ్లీ పశువులశాలలు నిర్మిస్తామని తేల్చిచెప్పారు. గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలన్నీ తొలగిస్తామని అధికారులు హామీఇచ్చారు.

పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ చట్టాల అమలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: కుల వివక్షలేని సమాజం సాధ్యం కావాలంటే ఎస్సీ, ఎస్టీ చట్టాలు సమర్థంగా అమలు కావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ చట్టాలు, షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల అత్యాచార నిరోధక చట్టం-1989 పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్ష, అత్యాచారాలు పూర్తిగా అంతరించాలంటే చట్టాలు పకడ్బందీగా అమలు జరగాలన్నారు. తప్పు చేసిన వారిపై పూర్తిస్థాయిలో ఎఫ్ఐఆర్, చార్జిషీట్ పోలీసులు నమోదు చేయటం, సాక్ష్యాలు బలంగా ఉండేలా చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. అయితే, వ్యక్తిగత కక్షల కోసం ఈ చట్టాన్ని ఉపయోగిస్తే కోర్టుల్లో శిక్ష పడే అవకాశం ఉండదన్నారు. సీఐడీ అదనపు ఎస్పీ జి.ప్రేమకాజల్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాలు 35 ఏళ్ల క్రితం ప్రారంభమైనా ఇంకా కులవివక్ష కేసులు నమోదు కావటం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు చక్రవర్తి, వాణి, మాధురి, జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ దుర్గా ప్రసాద్‌రాజు, జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కంత వేణు, అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపకపోతే ఉద్యమబాటే



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులను ఆపకపోతే ఉద్యమబాట తప్పదని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులతో కలిసి సోమవారం శ్రీకాకుళం డీఈఓ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.10 వేలు, ప్రతి నెలా 5వ తేది లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 50మందిని అన్యాయంగా తొలగించారని చెప్పారు. అనంతరం డీఈవో తిరుమల చైతన్యకు యూనియన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, యూటీయఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, ఎన్.వి.రమణ, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, నాయకులు పి.ఖగేష్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు టి.సీతమ్మ, కె.కౌసల్య, ఎన్.గీతాబాల, టి.ప్రవీణ, డి.జమ్మాలు, వై.లక్ష్మి, రాములమ్మ, భూదేవి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్‌గేమ్స్ స్టేట్‌మీట్



మోడర్న్ పెంటాథ్లెన్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా సాగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) స్కూల్‌గేమ్స్ బాస్కెట్ బాల్ (అండర్-19), మోడర్న్ పెంటాథ్లెన్(అండర్-17,19) చాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. ఎన్టీఆర్‌ఎంహెచ్ స్కూల్ మైదానంలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లా బాలబాలికల జట్లు రెండు విభాగాల్లోను చాంపియన్‌గా నిలిచారు. బాలుర విభాగం విశాఖ, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి రన్నరప్‌గా నిలిచాయి. మోడర్న్ పెంటాథ్లెన్ పోటీల్లో జాతీయ పోటీలకు ఎంపికైన 16 మందికి పతకాలు అందజేశారు. విజేత జట్లకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారుడు పి.సుందరరావు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, హెచ్ఎంలు మెండ చంద్రశేఖర్, సీహెచ్ దేవదత్తానంద్, బడి వెంకటరమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, బి.నిర్మల్‌కృష్ణ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి, డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, పి.తవిటయ్య, చల్లా జగదీష్, హరిబాబు, నారాయణరావు, పీడీలు, పీఈటీలు, టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొన్నారు.

కోడిపందెం శిబిరంపై దాడి



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నరసన్నపేట: మండలంలోని లుకలాం సమీపంలో వంశధార నది ఒడ్డున రెల్లి పొదల్లో జరుగుతున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఆదివారం రాత్రి వీటిని నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బృందం దాడులు నిర్వహించి నిర్వాహకుడు ఎం.శ్రీనుతో పాటు మరో 16 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కోడి కత్తి, 13 ద్విచక్ర వాహనాలు, 8 కోడి పుంజులు, 15 మొబైల్ ఫోన్లు, రూ.45420 నగదు స్వాధీనం చేసుకున్నారు.